# 'నా సంకల్పము సర్వశక్తిమంతము'

*(శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు 35వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భగవాన్‌యొక్క అన్ని సంస్థలలోనూ పనిచేస్తున్న స్వామి విద్యార్థులందరూ కలిసి సెప్టెంబరు 2వ తేదీ సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్ ఉపన్యసిస్తూ, తమ విద్యార్థులు సెంట్రల్ ట్రస్టులోనూ, తత్సంబంధిత సంస్థలలోనూ నిస్వార్థంగా, పవిత్ర బుద్ధితో పనిచేస్తున్నారని ప్రశంసించారు. భగవాన్ దివ్య ప్రసంగంయొక్క పూర్తి పాఠం ఈక్రింద ప్రచురిస్తున్నాము)*

ప్రేమస్వరూపులారా! మా విద్యార్థులు పవిత్ర హృదయులు, నిర్మల చిత్తులు, నిస్వార్థ హృదయులు, నిరహంకార స్వభావులు. స్వార్థమన్నది వారి చెంతకు ఏమాత్రము చేరటం లేదు. ఏదో కొంతమంది కొన్ని తప్పులు చేయవచ్చును. కాని, అవి వారికి వారే తిరిగి సవరించుకుంటున్నారు. మా విద్యార్థులు చిన్నవారని మీరు భావించకండి. వీరి శక్తిసామర్థ్యములను ఎవ్వరూ వర్ణించలేరు. పనులన్నీ వారే చేస్తున్నారు. పెద్దల పర్యవేక్షణలో పిల్లలే అన్ని పనులూ చేస్తున్నారు. కనుక, విద్యార్థులే మా సెంట్రల్ ట్రస్టు. వారు చేస్తున్న నిస్వార్థమైన పనులనుగురించి చెప్పే నిమిత్తమై నేను నిల్చున్నానుగాని లేకపోతే ఈరోజు మీతో మాట్లాడాలని అనుకోలేదు. ఈ విద్యార్థులే భవిష్యత్తులో సెంట్రల్ ట్రస్టుకు చేదోడు వాదోడుగా ఉంటుంటారు. సెంట్రల్ ట్రస్టు అంతా వీరిపైననే ఆధారపడి ఉన్నది. అందరూ రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. వీరు, వారు అని చెప్పటానికి వీలులేదు; అందరూ సమంగా కష్టపడి పనిచేస్తున్నారు.

విద్యార్థులారా! మీరే ఈ ట్రస్టుకు తగిన నాయకులుగా నిలిచి, దీనిని సరియైన మార్గములో నడిపి ప్రపంచమునకు ఆదర్శమును అందించాలని నేను ఆశిస్తున్నాను.

sri sathyasai vachanamrutam

భవిష్యత్తంతయు మీపైననే ఆధారపడి ఉంటున్నది. మీయొక్క ఆదర్శముచేతనే ట్రస్టు అభివృద్ధి కావాలి. మనకు మనీ (డబ్బు) ప్రధానం కాదు, పని ప్రధానం. Money comes and goes, morality comes and grows. మీయొక్క నీతి, నియమాలే (morality) మిమ్మల్ని ఉన్నతస్థాయికి తీసికొని వెళతాయి. కనుక, morality ని అభివృద్ధి చేసుకోండి. మానవత్వంలో అనేకరకములైన ఊహలు, భ్రాంతులు కలుగుతుంటాయి. కాని, అన్నీ కదిలిపోయే మేఘములవంటివే! వీటికి మీరు ఏమాత్రం లొంగిపోకూడదు. వీటిని ప్రక్కకునెట్టి మీ character (శీలము) ను నిలుపుకునే ప్రయత్నం చేయాలి.

విద్యార్థులారా! మీయొక్క తేజస్సు, మీరు చేసే పనులు అన్నీకూడను ఇతరులకు ఆదర్శప్రాయంగా ఉండాలి. మీరు ఆదర్శంగా నిలిచినప్పుడే దానిపై ప్రపంచమంతా నిలుస్తుంది. ఈనాడు సైన్సు & టెక్నాలజీ ఎన్నియో విధములుగా అభివృద్ధి చెందింది. కాని, ఇది కేవలం 'ట్రిక్-నాలజీ'యేగాని, సరియైన టెక్నాలజీ కాదు. మీ హృదయమునుంచి వచ్చే సత్య నిత్యమైన భావములను మీరు అనుసరించాలి. ఏది సత్యమో, ఏది అసత్యమో గుర్తించగలిగే 'డిస్క్రిమినేషన్ పవర్' (వివేచన శక్తి)ని పెంచుకోవాలి. ఏది మనకు అనవసరమో దానిని ప్రక్కకు నెట్టాలి. ఏది సత్యమో, ఏది నిత్యమో దానిని మీరు అనుసరిస్తూ రావాలి. సెంట్రల్ ట్రస్టే కాకుండా మిగతా ట్రస్టులుకూడా మీ ప్రవర్తనపై ఆధారపడి ఉన్నవి. ట్రస్టు చేపట్టే పవిత్రమైన కార్యములందు మీ కాలమును సద్వినియోగపరచి, సత్కీర్తిని సంపాదించండి. మీరు ఇంకొకరిపై ఆధారపడనక్కర్లేదు. మీ ఆత్మశక్తిపైన ఆధారపడి ఉండాలి. ఆత్మవిశ్వాసమును బలపరచుకోవాలి. అదే మీకు సర్వస్వమును అందిస్తుంది. ఆత్మవిశ్వాసము గలవానికి అన్నింటిలోను విజయం కలుగుతుంది. ఆత్మవిశ్వాసమే ప్రేమను బలపరుస్తుంది. ప్రేమయే మీకు సర్వ విధములైన శక్తిని చేకూరుస్తుంది. పని చిన్నదైనను, పెద్దదైనను ప్రేమచేతనే మీరు సాధించాలి. ఈ ప్రేమకు మీ విశ్వాసమే ప్రధానమైనది. కాని, ఈనాడు జనులు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నారు. 'నమ్మకమను రెండు నయనమ్ములే లేని అంధులైరి జనులు అవనియందు'. సత్యమే దైవం. ప్రేమయే దైవం. ప్రేమలో జీవించండి. సత్యము, ప్రేమ ఈ రెండూ మీరు సంపాదించుకోవాలి. ఈ రెండు కాళ్లతోనే నేను నడుస్తున్నాను. వీటిని మనము సాధిస్తే లోకమునంతా సాధించవచ్చు.

sri sathyasai vachanamrutam

బ్రిటీషువారు ఉన్నంతకాలము మద్రాసువాళ్లకి 'నీరిస్తాము, నీరిస్తామ'ని ఎంతగానో ప్రామిస్ చేశారు. కాని, కట్టకడపటికి మొండిచెయ్యి చూపించారు. త్రాగునీటికోసం మద్రాసువాళ్లు పడుతున్న అవస్థ చూసి నేను వాళ్లకి కృష్ణా జలాన్ని అందించాను. ప్రతి ఒక్క గుడిసెకుకూడను ఇప్పుడు నీరందుతున్నది. ప్రతి పిల్లవాడుకూడా 'మాకు సాయిబాబా అమృతాన్ని అందించాడు' అంటూ ఆనందంతో గంతులేస్తున్నారు. మీరు నమ్ముతారో నమ్మరోగాని నేను చెప్పక తప్పదు. ప్రతి నెలా కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నాము. అది చక్రవర్తి (సెంట్రల్ ట్రస్టు సెక్రెటరీ)కి తెలుసు. ఈ డబ్బునంతా 'డిస్ట్రిబ్యూట్' చేయడం ఆయనయొక్క పని. ఎవరో ఒకరు పనిచేయడానికి ఉండాలి కదా! స్వామియే అన్ని పనులూ చేయవచ్చును. కాని, కొంత 'హెల్ప్'కూడా కావాలి. అందువల్లనే కొంతమందిని ట్రస్టు సభ్యులుగా పెట్టుకొని, ఆ ట్రస్టు సభ్యులద్వారా ఈ పనులు జరుపుతున్నాను. నేనెవ్వరినీ నయాపైసా అడగటం లేదు. మీకందరికీ బాగా తెలుసు. నేను ఇన్ని కార్యములు చేయాలనుకుంటే ఎంతమందిదగ్గరనుండో డబ్బు ఆశించాలి. కాని, ఎవ్వరినీ ఆశించడం లేదు. నా సంకల్పము సర్వశక్తిమంతము. మేము ధనమును ఆశించడం లేదు; గుణమును ఆశిస్తున్నాము. ప్రేమ ఒక్కటి ఉంటే ఎన్నైనా సాధించవచ్చును. ప్రేమకంటే మించినది మరొకటి లేదు. ప్రేమయే దైవము, దైవమే ప్రేమ. ఈ ప్రేమను మీరు సాధించండి. ప్రేమతో జీవితాన్ని గడపండి. ఎవ్వరినీ మీరు ఆశించనక్కర్లేదు. ఆ ప్రేమయే మీకు అన్నీ సమకూరుస్తుంది. దేనికోసమూ మీరు కొరతపడకండి. అన్నీ ఆ ప్రేమయే మీకు అందిస్తుంది. తప్పుడుమార్గంలో పోకూడదు. అసత్యమాడకూడదు. అన్యాయము చేయకూడదు. అసహనంగా ప్రవర్తించకూడదు. సహనమే చాలా ప్రధానమైనది. అందరూ కలసి మెలసి ఉండాలి. వేదము చెప్పింది –

**సహనావవతు। సహనౌ భునక్తు।**
**సహ వీర్యం కరవావహై।**
**తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై।**

మన భారతీయులలో ఐకమత్యము చాలా తక్కువ. అన్నీ ఉన్నాయి. కాని, 'యూనిటీ' లేకపోవడంచేత 'ప్యూరిటీ' లేకుండా పోతున్నది. 'ప్యూరిటీ' లేకపోవడంచేతనే 'డివినిటీ'

srisathyasaivachanamrutam

రాకుండా పోతున్నది. 'డివినిటీ', 'ప్యూరిటీ' రెండూ ఉన్నప్పుడు మానవత్వముయొక్క కోరికలు సమస్తం నెరవేరుతాయి.

పిల్లల్లారా! నా మనసంతా నిరంతరము మీపైననే ఉన్నది. మీరు లేకపోతే నేను లేను. నేనుంటే మీరు, మీరుంటే నేను. 'ఐ అండ్ యు ఆర్ వన్' (నేను, మీరు ఒక్కటే). మనం ప్రత్యేకంగా లేము. కనుక, 'స్వామి మాతో మాట్లాడటంలేదే' అని మీరు బాధపడకండి. సంతోషంగా పనిచేయండి.

**( శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు 35వ వార్షికోత్సవం, తేదీ 2.9.2007, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasai vachanamrutam